క్లుప్తంగా

'రైతు భరోసా'కు 261 దరఖాస్తులు



పాన్‌గల్: మండలంలో నూతన పట్టదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతు భరోసా పథకానికి 261 మంది దరఖాస్తులు చేసుకున్నారని మండల వ్యవసాయాధికారి రాజవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ కావడంతో వివిధ గ్రామాల నుంచి నూతన పట్టదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు మొత్తం మండలంలో 380 మంది రైతులు ఉండగా.. వారిలో 261 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఏఓ పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో నేరాల నియంత్రణలో భాగంగా ఎక్కడికక్కడ నిఘా పెంచేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న పోలీసులకు తుఫాన్ వాహనాల అసోసియేషన్ సభ్యులు తమ వంతు అండగా నిలిచారు. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు జమ చేసిన రూ.50 వేలను శుక్రవారం స్థానిక ఎస్‌ఐ ఆనంద్‌ను కలిసి వారు అందజేశారు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్‌ఐ ఆనంద్ కోరారు. కార్యక్రమంలో దేవన్న, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



గోపాల్‌పేట: ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పొలికెపాడు, బుద్దారం గ్రామాల్లో శుక్రవారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు కవాతు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌ఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించడం, వారికి అండగా, అందుబాటులో ఉన్నామని చెప్పేందుకు కవాతు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాములు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలపై ఆంగ్ల ఉపాధ్యాయుడు రవి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం ద్వారా మనిషి తన అదుపులో ఉండరని, ఏకాగ్రత కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజాచారి, సంజీవయ్య, వరదాచారి, రుద్రమదేవి, జ్యోతి, లక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



వనపర్తి రూరల్: గ్రామాల్లో రెండో విడత చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని ఎంపీడీఓ రాఘవ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని అంజనగిరి, మెంటెపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ రాఘవ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మెంటెపల్లి గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి నిర్మాణానికి ముగ్గు పోసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటనారాయణ, బాలు, శ్రీకాంత్, కార్యదర్శి హరిత, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవన్న, తిరుపతయ్య, కొమరి సత్యయ్య, రామకృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణకు పకడ్బందీ చర్యలు



ఆత్మకూర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి



జిల్లాకేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పాన్‌గల్‌లో..

ఆత్మకూర్: పట్టణంలో దోమల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, నిత్యం ఫాగింగ్ చేపట్టడంతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టరు ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆత్మకూర్‌లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ చికెన్‌గున్యా, డెంగ్యూ కేసులు నమోదయిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు, ఇంటి పైకప్పు, ఆవరణల్లో పాత టైర్లు, బాటిళ్లు, ట్యాంకులు, నీటి నిల్వలు ఉన్నవాటిని గుర్తించి పారబోయాలన్నారు.

ఓపెన్ జిమ్‌కు నిధులు మంజూరు

ఆత్మకూర్‌లోని మినీ స్టేడియం ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. అలాగే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల్లో ప్రవేశాల సంఖ్యను గతేడాదికంటే 30 శాతం ఎక్కువగా ఉండే విధంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ పరిమళ, తహసీల్దార్ చాంద్ పాష, కమిషనర్ శశిధర్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడేలో భాగంగా మండల కేంద్రంతో పాటు వెంగళాయిపల్లి గ్రామాల్లో ఆయన సిబ్బందితో పర్యటించి సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వనపర్తిటౌన్: నిల్వ నీటితో రోగాలు సంభవించే ప్రమాదం ఉందని, రెండు మూడు రోజులకు ఒకసారి కొత్త నీటిని పట్టుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో పలు వార్డుల్లో తడి, పొడి చెత్త వేరుచేయడం, ఏబీసీ ప్రచారం, డెంగ్యూ, మలేరియాపై అవగాహన, డ్రెయినేజీల్లోని మురుగు తీయడం తదితర పనులను దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, వార్డు అధికారులు చంద్రకాంత్, గంగాధర్, వినయ్, ఆకాష్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

చికెన్ షాపు యజమానికి జరిమానా

జిల్లా కేంద్రంలోని కిరాణ, చికెన్ తదితర షాపుల్లో శుక్రవారం హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఓ చికెన్ షాపు లోపల శుభ్రంగా లేనందున రూ. 1,500 జరిమానా విధించారు.

ఆస్పత్రి వ్యర్థాల తరలింపులో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు

అమరచింత: జిల్లాలోని ఆస్పత్రుల్లోని వ్యర్థాలను తరలించడంలో స్వేతాంస్ నిర్వాహకులు అశ్రద్ధ చూపడంతో షోకాజ్ నోటీసులను ఇచ్చామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈమేరకు ఆస్పత్రిలోని వ్యర్థాల తరలింపుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులకు ఒక పర్యాయం వస్తున్నారని, దీంతో మున్సిపాలిటీ చెత్తబండిలో వీటిని వేసే పరిస్థితి దాపరించిందని తెలపడంతో వ్యర్థాలను సేకరించే నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలోని వ్యర్థాలను 24 గంటల లోపు అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. అదే విధంగా డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వపరంగా పీహెచ్‌సీ కోసం అనుమతులు వచ్చాయని, వీటి నిర్వహణ కోసం కావాల్సిన సిబ్బంది కోసం మంత్రి వాకిటి శ్రీహరికి తెలియపర్చామన్నారు.

అబార్షన్ వ్యవహారంపై విచారణ

పట్టణానికి చెందిన ఓ మహిళ తన గర్భంలో ఆడశిశువు ఉందనే సమాచారంతో అబార్షన్ చేసుకుందనే ఫిర్యాదుతో సదరు కుటుంబ సభ్యులను విచారించామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలాంటిది పక్క రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ చేసుకుని ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేసుకున్న ఘటనలో ఎలాంటి నిజం లేదని డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన వాంగ్మూలం సేకరించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫయాజ్, డాక్టర్ రూపశ్రీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ



అంగన్‌వాడీ చిన్నారులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ

అమరచింత: అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న చిన్నారులకు ఉచితంగా యూనిఫాంలను ప్రభుత్వం అందిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి విద్యార్థుల పురోగతితో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో ప్రాథమిక విద్య అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలో చేరిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. గర్భిణులు, ప్రసూతి, కిశోర బాలికల కోసం ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, టీచర్ రాధిక పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



వెంగళాయిపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: మండలంలోని వివిధ సబ్‌సెంటర్ల పరిధిలో కొనసాగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని, పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగళాయిపల్లి సబ్ సెంటర్ పరిధిలో ఎక్స్‌రే, క్షయవ్యాధి నిర్ధారణకు స్పూటమ్ సేకరణ, హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ వైద్యులు నాగరాజు, సీహెచ్‌ఓ రామయ్య, జిల్లా టీబీ నిర్ధారణ సిబ్బంది, వైద్య సిబ్బంది శాంతమ్మ, రామచందర్, సతీష్, రమాదేవి, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం సబ్ సెంటర్‌లో శుక్రవారం వైద్య అధికారి రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ చంద్రమౌళి షుగర్ వ్యాధిగ్రస్తులను పరిశీలించి 18 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయమం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గీత, అనురాధ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యోగా డేలో పాల్గొనండి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హార్ట్‌ఫుల్‌నెస్ మండల కన్వీనర్ దీర్ఘాయువు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కల్యాణ మండపంలో శనివారం ఉదయం 5 గంటల నుంచి 7:30 గంటల వరకు యోగాసనాలు, ధ్యానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం



మదనాపురం: మండల మహిళా సమాఖ్యను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షురాలిగా జయలక్ష్మి కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారి సుజాతను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తాచాటాలి: బీఆర్ఎస్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని.. బీఆర్ఎస్ పాలనలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజల మన్ననలు పొందిన వ్యక్తులను గుర్తించి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులుగా పోటీలో నిలపాలని.. అందుకు ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు కలిసి చర్చించుకోవాలని సూచించారు. పార్టీలో ఉంటూ ఇతర పార్టీలకు సహకరించే నమ్మక ద్రోహులతో అప్రమత్తంగా ఉండాలని.. అలాంటి వ్యక్తులతో ఎప్పటికైనా పార్టీకి నష్టమేనని తెలిపారు. నిబద్ధతతో పనిచేసే నాయకులకు పార్టీ అవకాశం ఇస్తుందని.. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వారికి అండగా నిలవాలని సూచించారు. ఓటర్లు ఇప్పటికే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని నిర్ణయం తీసుకున్నారని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సామ్యానాయక్, మాజీ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ నందిమళ్ల అశోక్, రంగారెడ్డి,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మదనాపురం: మండలంలోని కొన్నూరు గ్రామానికి చెందిన పరమేష్‌కు కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు పరమేష్‌ను ఎంపీటీసీ మాజీ సభ్యుడు శరత్‌రెడ్డి శుక్రవారం పూలమాల, శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కొండ శివారెడ్డి, గంటల వెంకటరామిరెడ్డి, కొండ నారాయణరెడ్డి, సంగిరెడ్డి వెంకటరెడ్డి, రాజిరెడ్డి, బాదం చిన్న, వెంకటస్వామి, నాయిని వాసు తదితరులు పాల్గొన్నారు.

అక్బర్‌పాషాకు సన్మానం

ఖిల్లాఘనపురం: బీజేపీ మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన అక్బర్‌పాషాను ఆయన సొంత గ్రామమైన మండలంలోని అగారంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆశాలపై పనిభారం తగ్గించాలి

వనపర్తి రూరల్: ఆశాలపై పనిభారం తగ్గించడంతో పాటు పారితోషికం లేని పనులు చేయించరాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొంటున్నామని కలెక్టర్ కార్యాయంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలాయ సిబ్బందికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఆశా వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ, కార్యదర్శి సునీత, ఆర్ఎన్ రమేష్, రామ్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ ప్రశాంత్

మదనాపురం: రైతులు, పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుందని, బీఆర్ఎస్ నాయకులు మతి తప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ మండిపడ్డారు. శుక్రవారం మదనాపురం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాగుకు నీళ్లు ఎప్పుడు ఇవ్వాలో తమకు తెలుసని, వారు చెప్పే వినాల్సిన దౌర్భాగ్యం పట్టలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో పంటలు ఎండిపోయి, రైతులు అప్పుల పాలైనప్పుడు ఆ పార్టీ నాయకులు ఎక్కడ పోయారని ప్రశ్నించారు. యాసంగిలో పంటలు ఎండిపోతుంటే కర్ణాటక సీఎంతో మాట్లాడి నీటిని విడుదల చేయించి పంటలు కాపాడిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. సరళాసాగర్ ప్రాజెక్టులో బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా ఇసుక అమ్ముకోవడం ద్వారానే కట్టకు గండి పడి రైతులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ అధ్యక్షులు సుక్క మహేష్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న సురేష్

వనపర్తి రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పని చేస్తున్న సెక్యూరిటీ, పారిశుద్ధ్య కార్మికులపై రాజ్‌దీప్ ఏజెన్సీ నిర్వాహకులు వేధింపులు ఆపాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. శుక్రవారం వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ కార్మికులతో సమావేశం నిర్వహించి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే రోజున ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు ప్రకటించిన నేపథ్యంలో ముందుగానే కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసి కార్మికులను హాలిడే ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కానీ కార్మికుల వేతనంలో కోతలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు వరుణ్, భారతి, రమ్య, మన్నెమ్మ, లావణ్య, నారమ్మ పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి సారూ..'

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో వీధిలైట్లు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ఎక్కడ సమస్య వచ్చినా పరిష్కరిస్తున్నారు కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాంనగర్ కాలనీలో సమస్య వస్తే మాత్రం పట్టించుకునే నాథుడు లేకుండా పోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు ఆరు నెలలుగా రాంనగర్ కాలనీలో చాలావరకు లైట్లు వెలగడం లేదు. ఇదే విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా గ్రామ పంచాయతీలో డబ్బులు లేవని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్ సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గురువారం రాంనగర్ కాలనీకి చెందిన ఓ పదేళ్ల బాలికను పాము కాటువేసింది. దీంతో హుటాహుటిన బాలికను వనపర్తి ఎంసీహెచ్ ఆస్పత్రికి తరలించగా.. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిసింది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి రాంనగర్ కాలనీలో లైట్లు వేయించాలని, లేదం

బాధిత కుటుంబానికి పరామర్శ



రాంనగర్ కాలనీలో ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

పాన్‌గల్: మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆది కర్ణాకర్ మృతదేహానికి కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, రాముయాదవ్, బ్రహ్మయ్య, నరేందర్‌గౌడ్, వాల్మీకినాయుడు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గోపాల్‌పేట: ఇబ్బందుల్లో ఉన్నవారికి రాంనగర్ కాలనీ సేవాసమితి ఎప్పుడూ అండగా ఉంటుందని సేవాసమితి సభ్యులు అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన గంధం గోకరయ్య అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న రాంగనర్ సేవాసమితి సభ్యులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.6వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బైని ఎల్లయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన వాకిటి శ్రీను కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.21,600 పోగు చేసి నగదును శుక్రవారం వాకిటి శ్రీను అందజేశారు. రానున్న రోజుల్లో అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్, సాగర్ కుమార్, కృష్ణయ్యయాదవ్, రాముసాగర్ ఉన్నారు.

'యాసంగిలో ఎగ్గొట్టిన 'రైతు భరోసా' ఎప్పుడు వేస్తారు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: యాసంగిలో రైతులకు ఎగ్గొట్టిన రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో ఎప్పుడు వేస్తారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పెబ్బేరు మండల అధ్యక్షుడు వనం రాములు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పెబ్బేరు మండలంలోని పాతపల్లి, బూడిదపాడు, ఈర్లదిన్నె, పెంచికలపాడు, జనుంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి జనాలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కర్రెస్వామి, దిలీప్‌రెడ్డి, సత్యారెడ్డి, వడ్డె ఈశ్వర్, రాజశేఖర్, గోవిందునాయుడు, కరుణాకర్, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న యువజన సంఘాల నాయికులు

అమరచింత: మండల కేంద్రానికి శుక్రవారం వచ్చిన మంత్రి వాకిటి శ్రీహరికి పలు సంఘాల నాయకులు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందించారు. డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, అమరచింతకు జిల్లా కేంద్రం నుంచి షటిల్ సర్వీస్‌లను కొనసాగించాలని, మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీకి రహదారి ఏర్పాటు చేయాలంటూ మంత్రికి విన్నవించారు. సీపీఎం పార్టీ నాయకులు చంద్రనాయక్‌తండా శివారులో భూత్పూరు రిజర్వాయర్ నీటితో ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని, గెడిసెల పోరు లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపుతూ ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాఘవేంద్ర, చంటి, కుతుబ్, వెంకటేష్, జీఎస్ గోపి, అజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రాంచందర్



పాన్‌గల్: ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా మండలంలోని మాధరావుపల్లి గ్రామానికి చెందిన బోరెల్లి రాంచందర్ నియమితులయ్యారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన రాంచందర్‌ను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. తనకు అవకాశం కల్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, సహకరించిన మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.